

మిషన్ భగీరథ పైపులైన్ల పక్కనే దేవాదుల టన్నెల్ లీకై ధ్వంసమైన వరి పొలం

# మూడు రోజుల ముచ్చటే..

**ధర్మసాగర్ వద్ద లీకైన దేవాదుల మూడో దశ టన్నెల్**

- నాలుగు గంటల పాటు వృథాగా పోయిన జలాలు
- నీళ్ల ధాటికి ధ్వంసమైన పంట పొలాలు
- మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు తప్పిన ప్రమాదం
- అప్రమత్తమై మోటర్ బంద్ చేసిన ఇంజినీర్లు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన దేవాదుల, ఎంబీ అధికారులు

ధర్మసాగర్, మార్చి 30: దేవాదుల మూడో దశ నీటి పంపింగ్ మూడు రోజుల ముచ్చటగానే మిగిలింది. అతి కష్టం మీద హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేట పంప్‌హౌస్‌లోని ఒక మోటర్‌ను ఆన్ చేసిన ఇంజినీర్లు.. ఆదివారం ధర్మసాగర్ రిజర్వాయర్ సమీపంలోని టన్నెల్ లీకై నీళ్లు బయటకు ఉప్పొంగడంతో దానిని బంద్ చేశారు. వివరాల్లోకి వెళితే.. దేవాదుల మూడో దశలో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం దేవన్నపేట వద్ద మూడు మోటర్లతో పంప్‌హౌస్‌ను నిర్మించింది. ములుగు జిల్లా రామప్ప నుంచి దేవన్నపేటకు టన్నెల్ ద్వారా గోదావరి జలాలు చేరుకుంటాయి. ఇక్కడి నుంచి ధర్మసాగర్ రిజర్వాయర్‌కు తరలించి, అక్కడి నుంచి పంటలకు సాగునీళ్లందించేందుకు ఎగువ ప్రాంతంలోని రిజర్వాయర్లకు తరలించేలా రూపకల్పన చేశారు. దేవన్నపేట నుంచి పైప్‌లైన్ వేయగా, ధర్మసాగర్ రిజర్వాయర్ డెలివరీ సిస్టర్న్‌కు 200 మీటర్ల ముందు మూడు మిషన్ భగీరథ పైప్‌లైన్లు ఉండడంతో టన్నెల్‌ను ఏర్పాటు చేశారు. అయితే మూడో దశ పనులు ఎప్పుడో పూర్తయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పంప్‌హౌస్‌ను ప్రారంభించలేదు. దీంతో రిజర్వాయర్లలో నీళ్లు లేక యాసంగి పంటలు ఎండుతున్నాయి. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో దీనిని ప్రారంభించేందుకు స్థానిక ఎమ్మెల్యే కడియం హడావిడిగా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిని ఈ నెల 18న తీసుకొచ్చారు. అయితే మోటర్లు మొరాయించడంతో వెనుతిరిగి వెళ్లారు. ఎలాగైనా పంపులు ఆన్ చేయాలని అధికారులను మంత్రులు ఆదేశించడంతో సంబంధిత ఏజెన్సీ ఇంజినీర్లను తీసుకొచ్చారు. వారం రోజులు కష్టపడిన ఇంజినీర్లు ఎట్టకేలకు ఈ నెల 27న తెల్లవారుజామున ఒక మోటర్‌ను ఆన్‌చేసి ధర్మసాగర్ రిజర్వాయర్‌కు నీళ్లను తరలించారు. విషయం తెలుసుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు పంప్‌హౌస్‌ను ప్రారంభించాలని ఆదే రోజు సాయంత్రం హడావిడిగా దేవన్నపేటకు చేరుకోగా మోటర్లు మళ్లీ మొరాయించాయి. చివరకు ఒక మోటర్‌ను ఆన్‌చేసి నీళ్ల పంపింగ్‌ను కొనసాగిస్తున్నారు. దీనిని ప్రారంభించిన మూడో రోజైన ఆదివారం ధర్మసాగర్ రిజర్వాయర్ సమీపంలోని టన్నెల్‌కు పలు చోట్ల పొలాల్లో పగుళ్లు ఏర్పడి పెద్ద ఎత్తున నీళ్లు బయటకు వచ్చాయి. సుమారు నాలుగు గంటల జలాలు బయటకు రావడంతో వరి పంటంతా ధ్వంసమైంది. పొలాల్లో పనిచేస్తున్న రైతులు గుర్తించి ధర్మసాగర్ రిజర్వాయర్ సిబ్బందికి చెప్పడంతో వారు ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో వారు వెంటనే మోటర్‌ను బంద్ చేశారు. అనంతరం ఘటన స్థలికి చేరుకున్న ఇంజినీర్లు ప్రమాద తీవ్రత భారీగానే ఉన్నట్లు గుర్తించారు.

### భగీరథ పైప్‌లైన్లకు తప్పిన ముప్పు

ధర్మసాగర్ రిజర్వాయర్ దిగువన 60 ఎంఎల్‌డీ, 25 ఎంఎల్‌డీ, 20 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ పర్ డే) కెపాసిటీ కలిగిన మూడు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల (డబ్ల్యూటీపీ)ను మిషన్ భగీరథ పథకంలో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించింది. ఈ ప్లాంట్‌ల ద్వారా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు 270 గ్రామాల దాహార్తి తీరుతుంది. ఆదివారం దేవాదుల టన్నెల్ నుంచి నీళ్లు లీకైన ఘటనలో ప్రమాద తీవ్రతకు మిషన్ భగీరథ షీట్ ట్రాక్‌పై వేసిన దిమ్మెలకు పగుళ్లు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకొని అక్కడకు వచ్చిన భగీరథ అధికారులు మరికొంత సేపు మోటార్ నడిస్తే పూర్తిగా పైప్‌లైన్ ధ్వంసమయ్యేదని అంటున్నారు. ఈ ప్రమాదం పగటి పూట జరిగి రైతులు చూడడంతో మోటర్‌ను నిలిపివేశారని, ఒక వేళ రాత్రి సమయంలో జరిగితే లక్షలాది మంది ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడేవారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం 16.5 క్యూమెక్‌ల నీటి డెలివరీ కెపాసిటీ కలిగిన ఒకే మోటర్ నడుస్తున్నది. ఇదే కెపాసిటీతో ఉన్న మరో రెండు మోటర్లు ఆన్ చేయాల్సి ఉంది. ఒకవేళ మూడు మోటర్లు ఒకే సారి నడిపిస్తే పక్కపక్కనే ఉండే టన్నెళ్ల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది.

### మా పొలంలో బుంగపడింది



నాకు 20 గుంటల భూమి ఉన్నది. రెండు నెలల క్రితం వరి పంట వేశాను. వరి మొత్తంగా ఈనింది. ఒక్కసారిగా పొలంలో బుంగపడి నీళ్లు వచ్చి ఇసుక మేట్టలు వారింది. పంట చేతికి అందే సమయంలో ఇలా అయితే మాకు నష్టం జరిగింది. ప్రభుత్వం మమ్ముల్ని ఆదుకోవాలి.

– మాచెర్ల బాబు, రైతు, ధర్మసాగర్ గ్రామం

### ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలి



పైపులైన్ లీకై నా వరి పొలంలో నుంచి నీళ్లు రావడంతో ఇసుక వచ్చి కప్పుకుపోయింది. తీవ్ర నష్టం జరిగింది. జరిగిన నష్టానికి ప్రభుత్వం సహాయం చేయాలి. చాలా సేపు పొలంలో నుంచి నీళ్లు పోయాయి. నేను ఉదయం వరి చేనుకాడికి వచ్చి ఇంటికి పోయిన. పది గంటల సమయంలో పొలం వద్ద పైపు లైన్ లీకైయిందని తెలియగానే వచ్చాను. వరి పంటకు నష్టం జరిగింది. ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి.

– మాచెర్ల సంజీవ, రైతు, ధర్మసాగర్



నర్సంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

# అక్కడ అంతా వారే..!

**నర్సంపేట సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో డాక్యుమెంట్ రైటర్ల హవా**

- పనికో రేటు ఫిక్స్ చేసి మరీ వసూళ్లు
- వారు చెప్తేనే కదులుతున్న ఫైళ్లు
- అనంతరం అధికారులు, సిబ్బందికి కమీషన్లు
- కార్యదర్శుల సంతకాలూ ఫోర్జరీ చేస్తున్న అక్రమార్కులు
- ఆగడాలు భరించలేకున్నామంటున్న ప్రజలు

నర్సంపేట, మార్చి 30: నర్సంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొందరు డాక్యుమెంట్ రైటర్ల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. ఎల్ఆర్ఎస్‌తో సంబంధం లేకుండానే ఓపెన్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు పూర్తిచేస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒక్కో పనికి ఒక్కో రేటు ఫిక్స్ చేసి, డబ్బులు ముట్టగానే ఎంతటి పనినైనా అవలీలగా చేసేస్తున్నారు. ప్రతిరోజూ ఈ తతంగమంతా సబ్ రిజిస్ట్రార్ కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు తెలుస్తున్నది. ఆన్‌లైన్‌లో ఇవ్వాల్సిన ఈసీని నగదు తీసుకొని ఏకంగా కార్యాలయంలోనే మాన్యువల్‌గా ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇక్కడ డబ్బులివ్వందే ఏ పనీ కాదని పలువురు బాహటంగానే చర్చించుకుంటున్నారు. రూ. 220 చలానా కడితే ఇవ్వాల్సిన మ్యారేజ్ సర్టిఫికెట్‌కు డాక్యుమెంట్ రైటర్లు రూ. 2 వేల నుంచి రూ. 3 వేల వరకు తీసుకుంటున్నారు.

### రైటర్లదే హవా..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్లు కీలకంగా మారారు. నర్సంపేటలో లైసెన్స్ ఉన్న వారు ముగ్గురుండగా, అనధికారికంగా మరో 25 మంది కొనసాగుతున్నారు. కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది డాక్యుమెంట్ రైటర్లు చెప్పిందే వేదంలా భావించి పనులు చేసేస్తున్నారు. డాక్యుమెంట్ రైటర్లు నిత్యం వివిధ రకాల ఫైళ్లతో కార్యాలయంలోనే తిరుగుతుంటారు. ఏ పని జరగాలన్నా, సర్టిఫికెట్ కావాలన్నా రైటర్లను కలిసి వారు నిర్ణయించిన రేటు ప్రకారం డబ్బులు చెల్లించాల్సిందే. ఒకవేళ ఇదేమిటని ప్రశ్నిస్తే ఆ పని పెండింగ్‌లో పడిపోవాల్సిందే. కాగా, వసూలు చేసిన డబ్బుల నుంచి కమీషన్ రూపంలో కొంతమొత్తం సబ్ రిజిస్ట్రార్ సహా సిబ్బందికి అందుతాయని పలువురు విమర్శిస్తున్నారు. పనివేళలు ముగిసిన అనంతరం కార్యాలయంలోని ఓ గదిలో పంపకాలు జరుగుతాయని ఆరోపిస్తున్నారు.

### ఫోర్జరీ సంతకాలతో అక్రమాలు

ఇద్దరు డాక్యుమెంట్ రైటర్లు ఫోర్జరీ సంతకాలతో పలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. వీరిద్దరూ డివిజన్‌లోని రెండు మండలాల్లోని పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శుల స్టాంప్‌లు దొంగచాటుగా తయారు చేసి వినియోగిస్తున్నట్లు తెలిసింది. సబ్ రిజిస్ట్రార్‌కే తెలియకుండా అడ్డదారిలో ఇళ్లు, భూములు రిజిస్ట్రేషన్ చేయించి, ఆ తర్వాత లోన్లు కూడా ఇప్పించి లక్షలు దండుకున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయంలో జరుగుతున్న తతంగాన్ని నిలువరించాలని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



గూడూరు: చుక్క నీరులేని చెక్‌డ్యాం

- చుక్క నీరులేని చెక్‌డ్యాంలు
- వీటిపై ఆధారపడే రైతులు పంటల సాగు
- వాగులోకి నీటిని వదిలి చేతికందే పంటను కాపాడాలని వేడుకోలు

# నాడు జీవనదిలా.. నేడు ఎడారిలా

**వట్టిపోయిన పాకాల వాగు**

**మహబూబాబాద్ జిల్లా గూడూరు** మండలంలో కొన్నేళ్లుగా జీవనదిలా ఉన్న పాకాల వాగు ప్రస్తుతం వట్టిపోయింది. దీనిపై ఆరు చెక్‌డ్యాంలు కట్టగా, అవన్నీ చుక్క నీరు లేక వెక్కిరిస్తున్నాయి. ఈ చెక్‌డ్యాముల్లో గతంలో ఎండాకాలంలో పాకాల చెరువు నీరు వదలడంతో రైతులు రెండు పంటలు పండించేవారు. ఈ ఏడాది కూడా అదే ఆలోచనతో వరి, మక్కజొన్న, మిర్చి పంటలు వేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారు వాగులో నీటిని వదలక పంటలు ఎండిపోతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాకాల చెరువు నీటిని వదిలి చేతికొస్తున్న పంటలను కాపాడాలని వేడుకుంటున్నారు.

**- గూడూరు, మార్చి 30**

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని సగం గ్రామాల రైతులు పాకాలవాగు నీటిపై ఆధారప డి వ్యవసాయం చేస్తుంటారు. ఈ వాగు పరీవాహకంలో పొనుగోడు, అయోధ్యపురం, గూ డూరు, బొల్లేపల్లి, నాయకపల్లి, తీగలవేణి, గోవిందాపురం, అప్పరాజుపల్లి వం టి గ్రామాలున్నాయి. వాగులో నీరుంటే భూ గర్భ జలాలు పుష్కలంగా ఉండి వ్యవసాయం, బోరు బావుల్లో నీరుండేది. ఈ అవసరాలను గుర్తించి గత ప్రభు త్వం పాకాల వాగుపై ఆరు చెక్‌డ్యాంలు నిర్మించింది. వీటిలో వర్షపునీటితో పాటు ఎండాకాలంలో పాకా ల చెరువు నీరు వదలడంతో రైతులు పంటలను పండించేవారు. ఈ సారి చెక్‌డ్యాంల కింది భాగంలో నీరులేక చేతికొచ్చిన పంటలు ఎండిపోతున్నాయి. తీగలవేణి, పాటి మీది తండా, నాయకపల్లి గ్రామాలకు పాకాల చెరువు నీటిని అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



మాటేడు గ్రామంలో 12 ఎకరాలు ఎండిపోయిన వరి పొలం



### చుక్కనీరు లేని ముష్టికుంట

డోర్నకల్, మార్చి 30 : డోర్నకల్ మండలం వెన్నారం గ్రామ సమీపంలోని ముష్టికుంటలో ప్రస్తుతం చుక్క నీరు లేదు. గతంలో వేసవిలో ఎస్సారెస్పీ జలాలతో నింపేవారు. ఈ ఏడాది విడుదల చేకపోవడంతో మార్చిలోనే ఎండిపోయింది. కుంటలో నీరు లేకపోవడంతో భూగర్భ జలాలు తగ్గి బావుల్లో నీరు ఇంకిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎండిపోయిన ముష్టికుంట

### పాకాల నీటిని వదిలి ఆదుకోవాలి

నేను ఆరెకరాలు వరి వేశాను. గతంలో మాదిరిగా పాకాల వాగులో నీటిని వదులుతారని ఆశపడ్డాను. పంటచేతికి వచ్చే దశలో నీరు లేక భూమి నెర్రెలు బారుతున్నది. గతంలో పాకాల వాగు ఎండాకాలంలో కూడా నిండుగా పారేది. పైనుంచి నీటిని వదలలేదు. మిర్చి పంట కూడా వేశాను. పెట్టుబడి కూడా రాలేదు. గతంలో నీరు, కరెంట్ 24గంటలు ఉండే, రైతుబంధు రాలేదు. పంట ఎండిపోవడంతో మళ్లీ వలస పోవాల్సి వస్తుందేమోనని ఆందోళనగా ఉంది. ఇప్పటికైనా పాకాల చెరువు నీటిని వదిలి పంటను కాపాడాలి.

– బానోత్ నర్సింహానాయక్, రైతు



ఎండిన పంటను చూపుతున్న రైతు

### 12 ఎకరాల పంట ఎండింది

మహబూబాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ), తొర్రూరు : వరి సాగు చేద్దామని 12 ఎకరాలు కౌలుకు తీసుకున్న. రూ. రెండు లక్షల 20 వేలు అప్పు తెచ్చి వరి పంట వేసిన. మొదట్లో మంచిగనే ఉన్నది. ఇప్పుడు పంట పూర్తిగా ఎండిపోయింది. ఏం చేయాలో తెలియడం లేదు. ఎవర్ని అడగాలో కూడా తోచడం లేదు. పక్కనే సబ్ కెనాల్ ఉంది. కానీ అందులో నీరు రా వడం లేదు. కళ్ల ముందు నీటి వంతెనలా కనిపించినా మా పొలాలకు మాత్రం చుక్క నీరు రాలేదు. బోరు, బావి ఉన్నా వాటిలో నీరు లేదు. బావిలో వారానికి ఒకసారి కొద్దిగా నీరు ఊరుతు న్నా 12 ఎకరాల పొలానికి అది ఏం సరిపోతుంది. మేం పంటకు పెట్టిన అప్పులు ఎప్పుడు తీర్చగలం. మా కుటుంబం ఇప్పుడు ఎలా బతకాలో అర్థం కావడం లేదు. ఈ పరిస్థితికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి. పక్కనే కాల్వ ఉన్నా నీరివ్వకపోతే రైతులు ఎలా బతకగలరు.

– అక్కల శంకర్, రైతు, మాటేడు, తొర్రూరు

- హౌసింగ్ బోర్డు లబ్ధిదారులకు నోటీసులు
- ఈ నెల 31లోపు చెల్లించకుంటే ఖాళీ చేయాలని అల్టిమేటం

# ఇండ్లు ఖాళీ చేయాలి

వరంగల్, మార్చి 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పేదలందరికీ ఇండ్లు కట్టిస్తామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. కష్టపడి ఇండ్లు కొనుక్కున్న మధ్య తరగతి వారిని అందులో నుంచి వెళ్ల గొట్టేందుకు ప్రయత్నిస్తున్నది. అన్ని విషయాల్లోనూ రాబడి మాత్రమే చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఏండ్ల క్రితం ప్రభుత్వం వద్ద ఇండ్లు కొనుక్కుని ఉంటున్న వారిని ఇబ్బందిపెడుతున్నది. తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ బోర్డు పరిధిలోని ఇండ్లలో ఉంటున్న వారి నుంచి ముక్కుపిండి మరీ బకాయిలు చేస్తున్నది. మార్చి 31లోపు అన్ని రకాల బకాయిలు చెల్లించాలని, లేకుంటే ఇండ్లను ఖాళీ చేయాలని హౌసింగ్ బోర్డు నోటీసులు జారీ చేసింది. హౌసింగ్ బోర్డు గతంలో ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో పెద్ద ఎత్తున ఇండ్లను నిర్మించి లబ్ధిదారులకు కేటాయించింది. నిర్దేశిత వాయిదాల ప్రకారం చెల్లింపులు చేసిన తర్వాత రిజిస్ట్రేషన్లు చేసేలా ఈ ప్రక్రియ ఉంటుంది. అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక మాంద్యం, ఇతర ప్రతికూల పరిస్థితులతో హౌసింగ్ బోర్డుకు గడువులోపు కొందరు చెల్లింపులు చేయలేకపోయారు. తెలంగాణ హౌసింగ్ బోర్డు ఇటీవలే వీరి వివరాలను సేకరించింది. అందరికీ నోటీసులు పంపింది. గడువులోపు చెల్లింపులు పూర్తి చేయాలని, లేకుంటే ఇండ్లను ఖాళీ చేయాలని అల్టిమేటం జారీ చేసింది. తెలంగాణ హౌసింగ్ బోర్డు నిర్మించిన ఇండ్లను అత్యధికంగా మధ్యతరగతి, దిగువ మధ్య తరగతి వారే కొనుగోలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అకస్మాత్తుగా ఇలా చేయడంతో ఇండ్లలో ఉంటున్న వారు ఆందోళన చెందుతున్నారు. అర్హులైన అందరికీ సొంత ఇల్లు నిర్మించి ఇస్తామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం బకాయిల విషయంలో తమను ఇబ్బందిపెట్టడం సరికాదని అంటున్నారు. తెలంగాణ హౌసింగ్ బోర్డు వరంగల్ డివిజన్ పరిధిలో వడ్డేపల్లి(హనుమకొండ), గొర్రెకుంట(వరంగల్), జగిత్యాల, నస్పూర్(మంచిర్యాల), మరిపెడ(మహబూబాబాద్), కరీంనగర్, జమ్మికుంట, జనగామ, కొత్తగూడెం కాలనీల్లోని ఇండ్లకు సంబంధించి రూ.44.69 కోట్ల బకాయిలు ఉన్నాయి. వరంగల్ డివిజన్ పరిధిలో 528 మందికి నోటీసులు జారీ చేశారు. ఈ నెల 31 లోపు బకాయిలు చెల్లించకపోతే ఇల్లు ఖాళీ చేయాలని నోటీసులో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే హౌసింగ్‌పై సమీక్ష నిర్వహించింది. ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు తెలంగాణ హౌసింగ్ బోర్డు నోటీసులు జారీ చేసింది.

### బకాయిల కోసమే

పేరుకు పోయిన బకాయిలు వసూలు చేసేందుకు చర్యలు తీసుకున్నాం. ఈ ప్రక్రియలో భాగంగానే బకాయిదారులకు నోటీసులు జారీ చేశాం. మార్చి 31లోపు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరాం. లబ్ధిదారులు గడువులోపు చెల్లింపులు పూర్తి చేయాలి.

– అంకంరావు, ఈఈ, హౌసింగ్ బోర్డు వరంగల్ డివిజన్





హనుమకొండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పంచాంగ శ్రవణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్–రేవతి దంపతులు, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, నాయకులు

# విశ్వావసుపై విశ్వాసంతో..

- తెలుగు సంవత్సరాది ఉగాదికి స్వాగతం పలికిన ప్రజలు
- షడ్రుచులతో చేసిన పచ్చడి ఆరగింపు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణాలు

**తెలుగు సంవత్సరాది ఉగాది** వేడుకలు ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా ఆదివారం ఘనంగా జరిగాయి. క్రోధినామ సంవత్సరానికి వీడ్కోలు పలికి.., శ్రీ విశ్వావసు నామ సంవత్సరానికి అత్యంత విశ్వాసంతో స్వాగతం పలికారు. వేకుజామునే నిద్రలేచి ఇళ్లు, వాకిలి శుభ్ర పరుచుకొని, ఇంటిల్లిపాదీ స్నానాలు ఆచరించి, నూతన వస్త్రాలు ధరించి, లేలేత మామిడి ఆకులతో ఇంటిని అలంకరించుకున్నారు. తమకు సమీపంలో ఉన్న ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. కొత్త కుండలో షడ్రుచులు తీపి, లవణం, చేదు, పులుపు, వగరు, కారంతో ఉగాది పచ్చడి, ప్రత్యేక పిండి వంటలు చేసి ఇష్టదేవతలకు నైవేద్యంగా సమర్పించి, ప్రత్యేక పూజలు చేసి ఆరగించారు. ఇక కొత్త ఏడాదిలో మన భావి జీవితం ఎలా ఉంటుందో చెప్పే పంచాంగ శ్రవణం కోసం ఆలయాలకు వెళ్లి, పంచాంగం తెలుసుకొని రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. గ్రామాల్లో రైతులు ఎద్దులను అలంకరించి కొత్త సాలు పనులు ప్రారంభించారు.

**- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్**



ఐనవోలు : మల్లన్న ఆలయంలో పంచాంగ పఠనం చేస్తున్న అర్చకుడు మధుకర్‌శర్మ



వేయిస్తంభాల ఆలయంలో నృత్యం చేస్తున్న కళాకారులు



మహదేవపూర్ : వ్యవసాయ పనులు ప్రారంభిస్తున్న రైతు కుటుంబం








